సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
గురువారం । 20 । జూన్ । 2024





**చేనేత కార్మికుడి ఆత్మహత్య**
కొన్న ఇంటి స్థలం వివాదాస్పదం కావడం.. మరోవైపు అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెందిన చేనేత కార్మికుడు ఉరి వేసుకుని బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. - 8లో



**ఖరీఫ్ సాగుకు సిం'సిద్ధం'**
వర్షాల రాకతో ఖరీఫ్ సాగు పనులు జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో విత్తన పంపిణీ, ఆర్బీకే సేవలు, రాయితీలపై జిల్లా వ్యవసాయాధికారితో మాటామంతీ. - 8లో

గరిష్టం/కనిష్టం
33.2 /24.2

**వాతావరణం**
జిల్లాలో బుధవారం 24.2 - 33.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### 'గౌడ' విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

కడప రూరల్ : గౌడన్నకు చేయూత ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు మన్నెం రామ్మోహన్‌గౌడ్ పర్యవేక్షణలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని గౌడ, ఈడిగ విద్యార్థుల్లో పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. బుధవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాగేంద్రప్రసాద్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ఇష్టంతో చదువుపై మక్కువ పెంచుకోవాలన్నారు. అలాగే క్రమశిక్షణ, ప్రణాళిక ముఖ్యమన్నారు. అనంతరం పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చాటిన పలువురు విద్యార్థులకు మొదటి, రెండవ, మూడవ నగదు బహుమతులను అందజేశారు. మెమొంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రసాద్‌గౌడ్, కొండయ్య గౌడ్, రమణయ్య గౌడ్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ విజయవాడ 9వ బ్యాచ్ 'డిప్లొమో ఇన్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్' 2024 కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రొద్దుటూరు సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో 40 సీట్లు ఉన్నాయని, కాలవ్యవధి 6 నెలలని, ఆసక్తిల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో అన్ని రకాల సహకార సంఘాలు, సహకార బ్యాంకుల్లో పనిచేస్తున్న అభ్యర్థులకు కనీస విద్యార్హత 10వ తరగతి అని, మిగతా వారికి ఇంటర్‌మీడియట్ అని తెలియజేశారు. 2024 జూలై 1 నాటికి 18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9440002147, 9398866200, 9573616794, 9959848424 సంప్రదించాలని కోరారు. జూలై 2వ తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు.

### హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ సందర్శన



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని పెద్దశెట్టిపల్లెలో ఉన్న హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు సందర్శించారు. ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడి గర్భిణుల వివరాలను సేకరించారు. హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి గర్భిణుల, బాలింతలు, కౌమార బాలికలు రక్తహీనతకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని అక్కడి అధికారులు, సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను అర్హులందరూ ఉపయోగించుకునేలా చూడాలన్నారు. అనంతరం అనీమియా వ్యాధిపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు డీపీఎం డాక్టర్ శశిభూషన్‌రెడ్డి, ఎస్‌ఓ రమేష్‌రెడ్డి, అరుణకుమారి, నారాయణ, హరినాథ్‌తో పాటు వైద్యాధికారి శ్రీనివాస్, సూపర్‌వైజర్లు బీపీ వరప్రసాద్, చంద్రకళ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఈశ్వరి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### తొలిరోజు సీట్ల భర్తీ అంతంత మాత్రమే

రాజంపేట టౌన్ : ఐటీఐలలో ప్రవేశాలలకు బుధవారం రాజంపేటలోని ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలోని మూడు ప్రభుత్వ, పన్నెండు ప్రైవేట్ ఐటీఐల్లో సీట్ల భర్తీకి అధికారులు విద్యార్థులకు టెన్త్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితాను వారికి పంపారు. ఆ మేరకు తొలి రోజు ఉదయం 50 మందికి, మధ్యాహ్నం 50 మందికి కౌన్సెలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. అయితే కేవలం 28 మంది మాత్రమే వివిధ ఐటీఐల్లో ప్రవేశం పొందారు. ఇందులో రాజంపేట ప్రభుత్వ ఐటీఐలో 8 మంది, పీలేరు ప్రభుత్వ ఐటీఐలో 8 మంది, తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐలో ముగ్గురు విద్యార్థులు వివిధ ట్రేడ్‌లలో చేరారు. రాయచోటిలోని ఓ ప్రైవేట్ ఐటీఐలో తొమ్మిది మంది ప్రవేశం పొందారు. అధికారులు విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించి వారు కోరుకున్న ఐటీఐల్లో సీట్లను కేటాయించారు. గురువారం కూడా కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. రెండోరోజు 101వ మెరిట్ నుంచి 237వ మెరిట్ వరకు కౌన్సెలింగ్‌కు పిలిచినట్లు తెలిపారు.

# సర్కారు బడులపై రాజకీయ పంజా!

- పచ్చనేతల గుప్పిట్లోకి ప్రభుత్వ పాఠశాలలు
- ఏకపక్షంగా వంటమనిషి, ఆయాల తొలగింపు
- ఆ పోస్టుల్లో టీడీపీ కార్యకర్తల నియామకం
- నేతల పెత్తనానికి విద్యాశాఖ అధికారుల వత్తాసు
- పేరెంట్స్ కమిటీ హక్కులను కాలరాస్తున్న కొత్త ప్రభుత్వం




సాక్షి ప్రతినిధి, కడప : నూతన ప్రభుత్వం పాలనా పగ్గాలు చేతబట్టి పట్టుమని పది రోజులు కాకముందే ఆ పార్టీ నేతలు సర్కారు బళ్లపై రాజకీయ పంజా విసురుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలను తమ గుప్పిట్లోకి తీసుకొని తాము చెప్పినట్లు చేయాలంటూ ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి పెంచుతున్నారు. పేరెంట్స్ కమిటీ ద్వారా నియమితులైన మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు, పారిశుద్ధ్య కార్మికురాలను, పేరెంట్స్ కమిటీతో సంబంధం లేకుండానే ఏకపక్షంగా తొలగించాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఆ పోస్టుల్లో తమ పార్టీ కార్యకర్తలను నియమిస్తున్నామని, తాము చెప్పినచోట సంతకాలు పెట్టాలంటూ ప్రధానోపాధ్యాయులను ఆదేశిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలపై పచ్చనేతల పెత్తనానికి సాక్షాత్తు విద్యాశాఖ అధికారులే వత్తాసు పలుకుతుండడం విచారకరం. అటు అధికారులు.. ఇటు పచ్చ నేతల మధ్య ఉపాధ్యాయులు నలిగిపోతున్నారు.

**పేరెంట్స్ కమిటీకే పూర్తి బాధ్యతలు..**

విద్యా హక్కు చట్ట ప్రకారం పాఠశాలల నిర్వహణపై విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకున్న పేరెంట్స్ కమిటీకే (అప్పట్లో దీని పేరు స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ) పూర్తి స్థాయి అధికారాలు ఉంటాయి. ఈ కమిటీ నెలకు ఓసారి సమావేశమై ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్న భోజన నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణ.. తదితర అంశాలపై పరిశీలన జరిపి సలహాలు, సూచనలు ఇస్తుంటారు. అవసరమైతే మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలిని, పారిశుద్ధ్య కార్మికురాలిని తొలగించి వారి స్థానంలో కొత్త వారిని నియమిస్తారు. ఈ అధికారాలన్నీ నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వానికి గానీ, విద్యాశాఖ అధికారులకు గానీ ఉండవు. ఒక్క పేరెంట్స్ కమిటీకి మాత్రమే ఉంటాయి. 2019 సెప్టెంబర్ 23వ తేదీ అప్పటి ప్రభుత్వం స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీ సూచనల మేరకే పార్టీలకతీతంగా వంటమనిషి, ఆయాల నియామకాలు చేపట్టారు. అయితే విద్యా హక్కు చట్టాన్ని గానీ, అందులోని నిబంధనలను గానీ లెక్కచేయని తెలుగుతమ్ముళ్లు సర్కారు బళ్లపై తమ ఆధిపత్యాన్ని చాటుకుంటున్నారు.

**జూలై వరకు పాత కమిటీకే అధికారాలు..**

రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చివరిసారిగా 2021 సెప్టెంబరు 22న పేరెంట్స్ కమిటీలకు ఎన్నికలు నిర్వహించారు. ప్రతి పాఠశాలలో పేరెంట్స్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ తోపాటు 13 మంది సభ్యులను ఎన్నుకున్నారు. రెండేళ్ల కాలపరిమితి ఉన్న ఈ కమిటీకి 2023 సెప్టెంబరు 21వ తేదీతో గడువు ముగుస్తుంది. అయితే నాటి ప్రభుత్వం ఈ కమిటీ కాల పరిమితిని 2024 జూలై వరకు పొడిగించింది. 2024-25 విద్య సంవత్సరంలో కొత్త కమిటీ ఎన్నుకునే వరకు పాత కమిటీకే పూర్తిస్థాయి అధికారాలను కట్టబెట్టింది. కాగా, పచ్చ పార్టీ నేతలు మాత్రం పేరెంట్స్ కమిటీని పరిగణలోకి తీసుకోకుండా వంటమనిషి, ఆయాల తొలగింపు, నియామకాలపై తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. ఒకవేళ ప్రస్తుత పేరెంట్స్ కమిటీలు తమకు అనుకూలంగా లేవని నూతన ప్రభుత్వం భావిస్తే, కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చి అన్ని పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీలను ఎన్నుకొన్న తర్వాతే వారి సూచనల మేరకు మార్పులు చేయవచ్చు కదా అని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

### పార్టీ కార్యకర్తలు అయ్యవార్ల మాట వింటారా?

ప్రభుత్వాలు మారగానే అప్పటివరకు పనిచేస్తున్న వంట మనిషి, ఆయాలను తొలగించి తమ పార్టీ కార్యకర్తలను నియమించుకుంటూపోతే.. ఆ వచ్చినవారు ఉపాధ్యాయుల మాట వింటారా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. పైగా సేవా భావంతో, నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని వండి పెడతారా? అన్నది సందేహమే. పారిశుద్ధ్య కార్మికురాలు రోజంతా బడిలోనే ఉండి ఎప్పటికప్పుడు టాయిలెట్లను శుభ్రం చేస్తూ ఉపాధ్యాయులకు సహకరిస్తుందా అన్నది ప్రశ్నార్థకమే. ఈ పరిస్థితుల్లో ఉపాధ్యాయులు వారిని పలికించుకొని నిబంధనల ప్రకారం పనులు చేయించాలంటే సాధ్యమయ్యే పని కాదు. ఇప్పటివరకు పాఠశాలలో చదివే పిల్లల తల్లిదండ్రుల్లో ఒకరికి ఈ మధ్యాహ్న భోజన నిర్వహణ బాధ్యతను అప్పగించడం ఆనవాయితీగా వస్తోంది. పారిశుద్ధ్య కార్మికురాలి నియామకం కూడా ఇదే తరహాలో చేపట్టారు. పార్టీ కార్యకర్తలకు రాజకీయ పునరావాసం కల్పించడం కోసం పాఠశాల భవిష్యత్తును పణంగా పెట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం

– జూనియర్ అధ్యాపకుల సంఘం డిమాండ్

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల విద్యార్థుల మాదిరిగానే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలని ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం జిల్లా సెక్రటరి చెప్పలి రాజారావు కోరారు. అలాగే ఇంటర్ చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతోపాటు నోట్‌బుక్స్‌ను కూడా ఉచితంగా అందించాలని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలు చేస్తే అడ్మిషన్లతో పాటు ఉత్తీర్ణత శాతం కూడా పెరుగుతుందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అమలు చేయాలని కోరారు.

### జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు

– అత్యధికంగా చెన్నూరులో 55.4 మి.మీ వర్షం నమోదు



కడపలో మేఘావృతమైన ఆకాశం

కడప అగ్రికల్చర్ : ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున నుంచి ఉదయం వరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. చెన్నూరులో అత్యధికంగా 55.4 మి.మీ వర్షం నమోదయింది. అలాగే చక్రాయపేటలో 30 మి.మీ, కడపలో 28.2, వల్లూరులో 23.8, ఎర్రగుంట్లలో 19, బిమఠంలో 18, కమలాపురంలో 17.4, ఖాజీపేటలో 16.4, సిద్దవటంలో 14.6, ముద్దనూరులో 11.2, తొండూరులో 10.2, వేంపల్లిలో 10, సికెదిన్నెలో 8.4, చాపాడులో 8.2, మైదుకూరులో 7, దువ్వూరులో 6.4, వేములలో 5, ప్రొద్దుటూరులో 4.6, పెండ్లిమర్రిలో 4.4, జమ్మలమడుగులో 3, వీఎన్‌పల్లిలో 2.4, కాశినాయన, బి.కోడూరులలో 2.2, కొండాపురంలో 1.2 మి.మీ వర్షం కురిసింది.

# ఎంఆర్‌సీ కార్యాలయం తనిఖీ

డీఈఓ అనూరాధ



ఎంఈఓ కార్యాలయంలో విద్యార్థుల యూనిఫాం దుస్తులను పరిశీలిస్తున్న డీఈఓ అనూరాధ

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలోని మండల విద్యావనరుల కేంద్రాన్ని బుధవారం డీఈఓ అనూరాధ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పలు రికార్డులను, హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ సమయ పాలనను పాటించాలని, విద్యార్థులకు అందించే మెనూలో నాణ్యత లోపం ఉంటే కఠినమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఆమె తెలియజేశారు. అనంతరం ఎంఈఓ కార్యాలయంలో ఉన్న విద్యార్థుల యూనిఫాం దుస్తులను పరిశీలించి, అన్నీ పాఠశాలలకు దుస్తులను అందజేశారా అని సీఆర్‌పీలను అడిగి ఆమె తెలుసుకున్నారు. ఎంఈఓ-2 అరుణ, కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్లు సురేష్, గౌతమి, సీఆర్‌పీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు**

అట్లూరు : చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి అనూరాధ పేర్కొన్నారు. స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో కూడిన కిట్లను అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించినందుకు విద్యార్థినిలతో పాటు ఆ పాఠశాల ఎస్‌ఓ ఫణిశ్రీని అభినందించారు. ఎంఈఓ విలియంరాజు, ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

### రైతు బజార్‌లో నాణ్యమైన టమాటాలు

– కిలో రూ. 60తో మార్కెటింగ్‌శాఖ ద్వారా అందజేత



కడప ఎడ్యుకేషన్: రైతు బజార్‌లో నాణ్యమైన టమాటాల అమ్మకాలకు అధికారులు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. కిలో రూ. 60లు ధర నిర్ణయించి అమ్మకాలు సాగిస్తున్నారు. కాగా వర్షాల రాకతో చాలా చోట్ల టమాట పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతు బజార్‌కు నాణ్యతలేని టమాట వస్తున్నాయి. ఈ నేపథ్యంలో చాలామంది వ్యాపారులు టమాటను తెప్పించడం మానేశారు. దీంతో వినియోగదారులు ఇబ్బందుపడుతున్నారు. ఈ విషయంలో మార్కెటింగ్‌శాఖ కల్పించుకుని వినియోగదారులు ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో పుంగనూరు నుంచి నాణ్యమైన టమాటాలను కొనుగోలు చేసి కడప రైతు బజార్‌కు పంపించారు. దీంతో రైతు బజారు సిబ్బంది సంబంధిత టమాటాలను ఎలాంటి లాభాపేక్ష లేకుండా కిలో 60 రూపాయల చొప్పున రైతు బజార్‌లో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి అమ్మకాలు సాగించారు.

# జిల్లాలో సీఐలు, ఎస్‌ఐల బదిలీలు

జిల్లాలో వివిధ సర్కిళ్ల, పోలీస్‌స్టేషన్‌ల పరిధిల్లో పనిచేస్తున్న సీఐలు, ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సీఐలు, ఎస్‌ఐలు వెంటనే తమకు కేటాయించిన స్థానాల్లో బాధ్యతలను స్వీకరించాలనీ ఎస్పీ ఆదేశించారు. – కడప అర్బన్

| సీఐ పేరు | ప్రస్తుతం | బదిలీ అయిన ప్రాంతం |
|---|---|---|
| బి.రామకృష్ణ | ఎస్‌హెచ్‌ఆర్‌సీ, కర్నూలు | కడప ఒన్‌టౌన్ యు/జి పీఎస్ |
| సి. భాస్కర్‌రెడ్డి | కడప ఒన్‌టౌన్ యు/జి పీఎస్ | వి.ఆర్, కర్నూలు రేంజ్ |
| కె. రమణారెడ్డి | ప్రొద్దుటూరు రూరల్ సర్కిల్ | ఖాజీపేట యు/జి పీఎస్ |
| పి. రామాంజులు | ఖాజీపేట యు/జి పీఎస్ | వి.ఆర్ కర్నూలు రేంజ్ |
| ఎస్. తేజమూర్తి | ఆదోని ఒన్‌టౌన్ యు/జి పీఎస్ | చిన్నచౌక్ యు/జి పీఎస్ |
| పి. నరసింహారెడ్డి | చిన్నచౌక్ యు/జి పిఎస్ | వి.ఆర్ కర్నూలు రేంజ్ |
| ఈ. కంభగిరి రాముడు | ఫ్యాక్షన్ జోన్, ప్రొద్దుటూరు | సీసీఎస్, కర్నూలు |
| **ఎస్ఐ పేరు** | **ప్రస్తుతం** | **బదిలీ అయిన పిఎస్** |
| కె. చిరంజీవి | ప్రొద్దుటూరు రూరల్ పీఎస్ | మైదుకూరు యు/జి పీఎస్ |
| జె. చంద్రశేఖర్ | తాళ్ల ప్రొద్దుటూరు పీఎస్ | బి. మఠం పీఎస్ |
| ఏ. విద్యాసాగర్ | బి. మఠం పీఎస్ | వి.ఆర్ కడప |
| బి. శివప్రసాద్ | ప్రొద్దుటూరు రూరల్ పీఎస్ | దువ్వూరు పీఎస్ |
| ఎస్. శ్రీనివాసులు | దువ్వూరు పీఎస్ | వి.ఆర్, కడప |

# ఘనంగా సహస్ర కలశాభిషేకం ప్రారంభం



కలశాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకులు



పీఠంపై కొలువుదీరిన లక్ష్మీ వెంకటేశ్వరుడు

కడప కల్చరల్ : దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో స్థానిక అర్చక బృందం సహస్ర కలశాభిషేకం శాస్త్రక్తంగా నిర్వహించారు .ఈ నెల 21 వరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో తొలి రోజున అర్చక బృందం ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరెడ్డితో తొలి పూజలు నిర్వహించారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానాల వేదిక్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేష్ బట్టర్ ఆధ్వర్యంలో అర్చకులు, భక్తులు ఊరేగింపుగా వెళ్లి పుట్టమన్ను సేకరించి ఆలయానికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ రంగ మండపంలో శేష వాహనంపై స్వామిని విశేష అలంకారంలో ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చారు. స్వామి ఎదుట పీఠంపై పవిత్రమైన జలాలను నింపిన కలశాలను ఏర్పాటు చేశారు. ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో కలశాలకు పూజలు జరిపారు ఇందులో భాగంగా సహస్ర కలశాధివాసం, విశ్వక్సేన ఆరాధన ,సంకల్పం, రక్షాబంధనం ,అంకురార్పణ, తదితర పూజలు చేశారు .ఈ కార్యక్రమాలు గురు శుక్రవారాలు కూడా కొనసాగనున్నాయి. సహస్ర కలశాభిషేకానికి కడప నుంచే కాక జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు .ఈ సందర్భంగా అర్చక ప్రముఖులు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానాలలో తప్ప ఇలా సహస్ర కలశాభిషేకం రాష్ట్రంలో ఎక్కడ ఏ ఆలయాలలో జరగలేదన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఈ పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

# ఆణిముత్యాలు అమలయ్యేనా?

- గతేడాది టెన్త్ టాపర్లకు రూ.లక్ష నగదు బహుమతి
- జిల్లా, నియోజకవర్గ స్థాయి విజేతలకు కూడా ప్రోత్సాహకాలు
- ఈ ఏడాది ఇంకా అందని మార్గదర్శకాలు



గతేడాది టాపర్‌లకు నగదు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న కలెక్టర్ విజయరామరాజు (ఫైల్)

కాశినాయన : ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయడమే లక్ష్యంగా.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులను ప్రోత్సహించి మిగిలిన విద్యార్థుల్లో స్ఫూర్తినింపడమే ధ్యేయంగా గత ప్రభుత్వం 'ఆణిముత్యాలు' పథకం అమలు చేసింది. ఇందులో భాగంగా పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందించింది. ఈ పథకాన్ని ఏటా అమలు చేయనున్నట్లు స్పష్టం చేసింది. దీంతో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించారు. నగదు ప్రోత్సాహకాలు అందుతాయని భావించారు. పదవ తరగతి విద్యార్థులకు మాత్రమే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రతి గ్రూపులో టాపర్‌లను ఎంపిక చేసి ప్రోత్సాహకాలు అందించారు. ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థులు చదువుతున్న పాఠశాలల్లో ఉపాధ్యాయులను, ప్రిన్సిపల్‌లను, నగదు ప్రోత్సాహం అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులను కూడా గత ప్రభుత్వం సత్కరించి గౌరవించింది.

**టాపర్‌లకు రూ.లక్ష బహుమతి**

ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ వివిధ గ్రూపుల్లో చదివిన విద్యార్థుల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని ఎంపిక చేసి టాపర్‌లకు రూ.లక్ష నగదు ప్రోత్సాహకాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.75 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.50 వేలు అందజేశారు. నగదు పురస్కారంతో పాటు సర్టిఫికెట్, మెడల్స్ కూడా ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహించారు.

**జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ప్రోత్సాహకాలు**

నగదు ప్రోత్సాహకాలు కేవలం రాష్ట్రస్థాయికే పరిమితం చేయకుండా నియోజకవర్గ, జిల్లాస్థాయికి వర్తింపజేశారు. నియోజకవర్గ స్థాయి టాపర్‌లకు రూ.15 వేలు, ద్వితీయ స్థానంలో రూ.10 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు అందజేశారు. జిల్లా స్థాయిలో టాపర్‌లకు రూ.50 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.30 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.15 వేలు అందించారు. ఈ రెండు స్థాయిల్లో కూడా ఇంటర్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు. జగనన్న స్ఫూర్తితో కొన్ని ప్రాంతాల్లో స్థానిక దాతల సహకారంతో పాఠశాల స్థాయిలో టాపర్‌లకు నగదు పురస్కారం అందజేశారు. పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానానికి రూ.3 వేలు, ద్వితీయ స్థానానికి రూ.2 వేలు, తృతీయ స్థానానికి రూ.వెయ్యి నగదు బహుమతిని అందజేశారు.

**ఈ ఏడాది సందిగ్ధం**

ఆణిముత్యాలు పథకానికి గతేడాది తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి గొప్ప స్పందన లభించింది. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదని, భవిష్యత్తులో కూడా కొనసాగించాలని కోరారు. గతేడాది జూన్ 20 నాటికి అన్ని స్థాయిలలో నగదు ప్రోత్సహకాలు అందించే కార్యక్రమం పూర్తి చేశారు. అయితే ఈ ఏడాది నగదు పురస్కారాలు అందుతాయా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయం నుంచి కూడా ప్రకటన వెలువడలేదు. జిల్లా విద్యాశాఖాధికారులకు కూడా మార్గదర్శకాలు అందకపోవడంతో ఈ ఏడాది నగదు ప్రోత్సాహకాలు ఇస్తారా లేదా అనే సందేహం సర్వత్రా వ్యక్తమవుతుంది. మరి 'ఆణిముత్యాల'ను ఈ ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహిస్తుందో లేదో వేచి చూడాలి.

## క్లుప్తంగా

### కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరుచేయాలి



జిల్లా కార్మిక శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రామాంజనేయులు, లింగన్న

వేంపల్లె : భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న కోరారు. పులివెందులలోని భవన నిర్మాణ కార్మికుల కార్యాలయంలో జిల్లా కార్మిక శాఖ అధికారిని బుధవారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గం లోని మండలాల్లో భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదన్నారు. లాగిన్ సౌకర్యం లేదంటూ కార్మికులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారన్నారు. తక్షణమే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### రైలు కిందపడి మహిళ మృతి



గుర్తు తెలియని మహిళ మృతదేహం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప-కనుమలోపల్లె రైల్వే స్టేషన్ మధ్య గూడ్స్ రైలు తగిలి గుర్తు తెలియని మహిళ మృతి చెందిందని కడప రైల్వే సీఐ నాగార్జున తెలిపారు. సీఐ కథనం మేరకు...గుర్తు తెలియన మహిళ వయస్సు 40–45 సంవత్సరాల మధ్య ఉంటుందని, సడన్‌గా ట్రాక్ మీదకు రావడంతో గూడ్స్ రైలు తగిలి తలకు బలమైన గాయాలై అక్కడి కక్కడే మృతి చెందిందన్నారు. ఎత్తు 5.5 అడుగులు ఉంటుందని, ఎరుపు రంగు జడ, కోల ముఖం, బ్లూ, బ్లాక్ డిజైన్ జాకెట్, బ్లూ పాచీ కలర్ ఎరుపు, నలుపు పూలు కలిగిన చెక్ డిజైన్ టెరీ కాటన్ చీర ధరించి ఉందన్నారు. మృతురాలి గురించి ఎటువంటి ఆచూకీ తెలిసినా కడప రైల్వేస్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావు (సెల్ నెంబరు 94409 00811)కు సమాచారం అందించాలన్నారు.

### గుర్తు తెలియని వాహనం ఢీకొని..



భూమిరెడ్డి నారాయణరెడ్డి (ఫైల్)

చెన్నూరు : కడప-కర్నూలు జాతీయ రహదారి చెన్నూరు విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున కనపర్తి గ్రామానికి చెందిన భూమిరెడ్డి నారాయణరెడ్డి (38) గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. కనపర్తి గ్రామానికి చెందిన భూమిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో చెన్నూరు విద్యుత్ సబ్ స్టేషన్ (చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రం) సమీపంలో వెళ్తున్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బావ బాల గురు ప్రసాద్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### • పెన్నా పరవళ్లు



ఎగువన కురిసిన భారీ వర్షాలకు కడప జిల్లా మీదుగా ప్రవహించే పెన్నా నది పరవళ్లు తొక్కుతోంది. ఇటు జిల్లాలోనూ విస్తారంగా వర్షాలు కురవడతో.. వాగులు, వంకల నుంచి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. సిద్దవటం వద్ద పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తోంది. బుధవారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షాలకు నదిలో భారీగా నీరు చేరి కాజ్‌వేకు దగ్గరగా ప్రవహిస్తోంది. వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి ఇబ్బందిపడిన రైతులు నదికి నీరు చేరడంతో వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. – సిద్దవటం

### నింగి నుంచి నేలకు సప్త వర్ణాలు

సాయంత్రం వేళ చల్లని గాలులు. దీని తోడు చిరు జల్లులు కురిశాయి. దీంతో వాతావరణం చల్లబడింది. మదనపల్లెలో బుధవారం నింగి నుంచి నేలకు సప్త వర్ణాల ఇంద్ర ధనస్సు కొలువుదీరింది. ఇది చూపులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధులను చేసింది. కొందరు సెల్‌ఫోన్లలో ఫొటోలు తీశారు.

– మదనపల్లె సిటీ



# ఖరీఫ్ సాగుకు సం‘సిద్ధం’

- వరుణుడి కరుణతో ఊపందుకున్న వ్యవసాయ పనులు
- సాధారణ సాగుకు మించి సాగు లక్ష్యంగా అడుగులు
- ఈ ఏడాది నూనె గింజల సాగుపై ప్రత్యేక దృష్టి
- సాక్షితో జిల్లా వ్యవసాయాధికారి అయితా నాగేశ్వరరావు

కడప అగ్రికల్చర్ : వరుణుడు కరుణించడంతో ఈ ఏడాది ఖరీఫ్ రైతు ముందడుగు వేస్తున్నారు. సాధారణంగా ఏటా జూన్ రెండో వారంలో తొలకరి వర్షాలు మొదలవుతాయి. అప్పటికే పొలాలను దుక్కి దున్ని సిద్ధం చేసిన రైతులు మెట్ట భూముల్లో పంటల సాగు ఆరంభిస్తారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవడంతో ప్రస్తుతం వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. జిల్లాలో ఈ ఏడాది సాధారణ సాగుకు మించిన సాగు లక్ష్యంగా పెట్టుకుని రైతుకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉంచామని జిల్లా వ్యవసాయాధికారి అయితా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ విషయాలపై సాక్షితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు.

**■ ఖరీఫ్ సీజన్‌లో రైతుకు అవసరమైన విత్తనాల గురించి ఎలాంటి చర్యలు తీసుకున్నారు.?**

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు, వేరుశనగ కాయలు 11192 క్వింటాళ్ల మేర సిద్ధంగా ఉంచాం. వాటిని ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్నాం. రైతుకు సంబంధించిన విత్తనాలకు ఎలాంటి ఇబ్బంది లేదు.

**■ జిల్లాలో ఎలాంటి పంటల సాగుకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు?**

జిల్లాలో అధికసంఖ్య రైతులు వరి పంటకే ప్రాధాన్యం ఇస్తారు. ఎందుకంటే కేసీ కాలువతో పాటు కుందు, పెన్నా నదుల్లో నీరు ఉండడంతో ఎక్కువ మంది వరిసాగుకే మొగ్గుచూపుతున్నారు. దీంతో ఈ ఏడాది 32 వేల హెక్టార్లలో వరిపంట సాగు చేయాలని నిర్ణయించాం. దీంతోపాటు కంది, మినుము, పత్తి, వేరుశనగ పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

**■ నూనె గింజల పంటల సాగుకు రాయితీలు ఉన్నాయా?**

జిల్లాలో ఏటా నూనె గింజల సాగు తగ్గుతోంది. ఈ ఏడాది సన్ ఫ్లవర్ సాగు పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది ఐదువేల ఎకరాల్లో సన్ ఫ్లవర్ పంట వేసేలా రైతును ప్రోత్సహించేందుకు మినీ కిట్లు ఉచితంగా అందించాలని ప్రభుత్వానికి నివేదిక పంపాం.

**■ జిల్లాలో మిల్లెట్స్ సాగు పరిస్థితి ఏమిటి?**

ప్రజల ఆహారపు అలవాట్లు మారాయి. పంట కాలం తక్కువగా ఉన్న మొక్క జొన్న, రాగులు, కందులు, అపరాల పంటల సాగును ప్రోత్సహిస్తున్నాం. జిల్లాలో ఈ ఏడాది ఎనిమిది వేల హెక్టార్లలో మిల్లెట్స్ పంటలు సాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

**■ రైతు భరోసా కేంద్రాలలో సేవలు సక్రమంగా అందుతున్నాయా?**

జిల్లాలో 432 రైతు భరోసా కేంద్రాలున్నాయి. రైతులకు కావాల్సిన అన్ని రకాల సేవలు వాటి ద్వారా అందిస్తున్నాం. రైతుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందించేందుకు ఏర్పాట్లుచేస్తాం. ఈ క్రాప్ నమోదును సకాలంలో చేసి రైతులకు భరోసా కల్పిస్తున్నాం.

**■ అగ్రి ల్యాబ్ పనితీరు ఎలా ఉంది.?**

జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌తోపాటు నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఆరు అగ్రి ల్యాబ్స్ ఉన్నాయి. జిల్లా కేంద్రంలోనూ ల్యాబ్ పనులు జరుగుతున్నాయి. ఇక్కడి శ్యాంపుల్స్‌ను మిగతా ల్యాబ్‌లకు పంపి ఎరువు, విత్తన నాణ్యత తెలుసుకుంటున్నాం. ఆర్‌బీకే స్థాయిలో విత్తన మొలకశాతం, రైతుల వారీ శాంపిల్స్ సేకరించి నివేదిక వారికి ఇస్తున్నాం.

**■ వ్యవసాయ రుణాలు రైతులకు అందుతాయా?**

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి చిన్న, సన్నకారు రైతులు సాగు చేసే పంటలకు రుణాలు మంజూరు చేయించేందుకు మా వంతు కృషి చేస్తున్నాం. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా బ్యాంకర్లు రూ.4135 కోట్ల రుణం లక్ష్యంగా నిర్ణయించారు.

**■ ప్రైవేటు దుకాణాల్లో విత్తనం కొనుగోలు చేసేవారికి మీ సలహా ఏమిటి?**

ప్రైవేటు దుకాణాల్లో త్తనాలను కొనుగోలు చేసే రైతులు ఖచ్చితంగా డీలర్ వద్ద నుంచి బిల్లులు తీసుకోవాలి. పంట దిగుబడి వచ్చే వరకు వాటిని భద్రంగా ఉంచుకోవాలి. విత్తనాల మొలకశాతంలో ఎలాంటి సమస్య వచ్చిన తక్షణమే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.

> **ఖరీఫ్‌లో పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు ఏ చర్యలు చేపడుతున్నారు?**
>
> జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాధారణసాగు విస్తీర్ణం 75189 హెక్టార్లు ఉండగా, మేము లక్ష్యానికి మించి 79115 హెక్టార్లకు పెంచాలని నిర్ణయించాం. ప్రస్తుతం వర్షాలు కూడా ప్రారంభమైమాయి. ఇప్పటికే జిల్లాలో 1500 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి.



అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయాధికారి

సాక్షి ఇంటర్వ్యూ

### నేడు అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పౌర్ణమి సందర్భంగా గురువారం రాత్రి ఎనిమిది గంటలకు అరుణాచలానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీసుకు ముందస్తుగా రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. పెద్దలకు రూ.1050, పిల్లలకు రూ.570 ఛార్జి ఉంటుందన్నారు. భక్తులు www. apsrtc. online. inలో టికెట్ బుక్ చేసుకోవచ్చునన్నారు.

**20న ఔత్సాహిక వ్యాపారులతో సమావేశం**

కడప ఆర్టీసీ బస్టాండులో ఖాళీగా ఉన్న 22, కమలాపురం బస్టాండులో 4 దుకాణాలను సీల్డ్ టెండర్ ద్వారా కేటాయిస్తున్నట్లు కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. గురువారం సాయంత్రం 5.00 గంటలకు ఔత్సాహిక వ్యాపారులతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

**నేడు డయల్‌యువర్ డీఎం**

కడప డిపో పరిధిలో ఆర్టీసీ బస్సులతో సమస్యలు, ఆదాయం పెంపునకు సూచనలు తీసుకునేందుకు గురువారం సాయంత్రం 4.00 నుంచి 5.00 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఓ ప్రకటనలో తెలిపారు. 995922 5774 నెంబరుకు ఫోన్ సలహాలు, సూచనలు అందించవచ్చన్నారు.

## ‘అనీమియా’ వ్యాధి నిర్మూలనకు చర్యలు

కడప రూరల్ : పీఎం జన్మాన్–ప్రైమ్ మినిస్టర్ జన జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. కడప నగరంలోని ఎర్రముక్కపల్లె అర్బన్ హెల్త్ సెంటర్‌లో సికిల్ సెల్ అనీమియా నిర్మూలనపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ఈ వ్యాధి ఎక్కువగా ట్రైబల్ ఏరియాలో ఉంటుందన్నారు.

అందువల్ల ఆ ప్రాంత వాసులకు రక్త పరీక్షల ద్వారా వ్యాధి కనుగొని చికిత్స చేయాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. సికిల్ సెల్ అనీమియా జన్యు సంబంధిత వ్యాధి అని పేర్కొన్నారు. ఈ వ్యాధి గ్రస్తులలో ఎర్ర రక్త కణాలు కొడవలి రూపంలో మారి రక్త ప్రసరణ ద్వారా శరీర భాగాలలో ప్రవహించి మంచి రక్త కణాలకు అడ్డుపడుతాయని తెలిపారు. గుర్తించిన తర్వాత రక్తాన్ని ఎక్కించడం, బోన్ మారో చికిత్స, స్టెమ్‌సెల్స్ చికిత్స ద్వారా మాత్రమే వ్యాధి నియంత్రించవచ్చన్నారు. వ్యాధిగ్రస్తులకు నెలకు రూ. 10 వేలు చొప్పున పెన్షన్ వస్తుందన్నారు. ఈ వ్యాధిపై ప్రతి హెల్త్ క్లినిక్, పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, ఆరోగ్యశ్రీ డీసీఓ డాక్టర్ బాలాంజనేయులు, ఆర్బీఎస్కే కో ఆర్డినేటర్ డాక్టర్ రమేష్, వైద్యులు ఉబేదుల్లా, రియాజ్ అహ్మద్, డీఐఓ మనోరమ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

### యువకుడిపై కత్తితో దాడి

కడప అర్బన్ : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాజీవ్ పార్క్ సమీపంలో ఓ యువకుడు, మరో యువకుడిపై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ సంఘటన బుధవారం రాత్రి పది గంటల సమయంలో చోటు చేసుకుంది. సంఘటన స్థలాన్ని సీఐ సి.భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు బ్లూ కోల్ట్స్ సిబ్బంది హుటాహుటిన చేరుకున్నారు. గాయపడిన యువకుడిని రిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటన వివరాలు తెలియాల్సి వుంది. పోలీసులు సమగ్రంగా విచారిస్తున్నారు.

### ఆటో బోల్తాపడి విద్యార్థి మృతి

కురబలకోట : ఆటో బోల్తాపడి పదో తరగతి విద్యార్థి జియావుల్లా మృతి చెందారు. ముదివేడు ఎస్ఐ మల్లిఖార్జున రెడ్డి కథనం మేరకు.. కురబలకోట మండలం ముదివేడుకు చెందిన టైలర్ ఎస్.రఫీకి ముగ్గురు సంతానం. ముదివేడు మోడల్ స్కూల్‌లో పెద్ద కుమారుడు ఎస్.జియావుల్లా (15)పదో తరగతి చదువుతున్నాడు. వీరంతా దిగువశీతివారి పల్లె వాసి యుగంధర్‌రెడ్డి ఆటోలో పాఠశాలకు వెళ్లి తిరిగి వస్తారు. బుధవారం సాయంత్రం యథా ప్రకారం పాఠశాల ముగిసిన వెంటనే ఐదుగురు విద్యార్థులను ఆటోలో తీసుకువస్తున్నారు. కొంత దూరం రాగానే ప్రమాదవశాత్తూ ఆటో బోల్తా పడింది. విద్యార్థి జియావుల్లా కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. మదనపల్లె ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. డ్రైవర్ యుగంధర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రమాదంలో ఒకరి మృతి

సంబేపల్లె: చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై గుట్టపల్లె సమీపంలో బుధవారం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో షేక్ అబ్దుల్ రెహమాన్ సాహెబ్(65) మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా కలకడకు చెందిన అబ్దుల్ రెహమాన్ సాబ్ కలకడ నుంచి సంబేపల్లెకు కాలినడకన వస్తున్నారు. గుర్తు తెలియని వాహనం అతడిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

## కర్నూలు నుంచి కార్యాలయాల తరలింపు తగదు



మాట్లాడుతున్న రాయలసీమ విద్యావంతుల వేదిక ప్రతినిధులు

ప్రొద్దుటూరు : కర్నూలు జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన ప్రభుత్వ కార్యాలయాలను అమరావతికి తరలించాలని నిర్ణయించడం తగదని రాయలసీమ విద్యా వంతుల వేదిక ప్రతినిధులు మహమూద్, వరలక్ష్మి, పద్మ అన్నారు. స్థానిక సృజన సామాజిక వేదిక కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ రాయలసీమ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తారని సీమ ప్రజలంతా ఎన్డీఏ కూటమికి అత్యధిక సీట్లు కట్టబెట్టారన్నారు. అయితే రాయలసీమ వాసుల హక్కులను విస్మరించి కర్నూలు లోని మానవ హక్కుల కమిషన్, లోకాయుక్త, వక్ఫ్‌బోర్డు, ఎలక్ట్రిసిటీ అథారిటీ కార్యాలయాలను అమరావతికి తరలించేందుకు సిద్ధమవడం తగదన్నారు. అభివృద్ధిలో వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు సమ ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖపట్నంలో ఏర్పాటుచేసిన కృష్ణా రివర్ బోర్డును సీమకు తరలించాలన్నారు. అభివృద్ధి కేంద్రీకరణ ప్రాంతాల మధ్య విభేదాలకు దారితీస్తుందని, ప్రభుత్వ కార్యాలయాల తరలింపు ప్రతిపాదన విరమించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రాయలసీమ విద్యార్థి శక్తి కన్వీనర్ హరిత, రాయలసీమ మహిళా శక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మీదేవి, నాస్తిక సమాజం కన్వీనర్ పల్లవోలు రమణ పాల్గొన్నారు.

## నీట్ పరీక్షల్లో అక్రమాలపై చర్యలు చేపట్టాలి



అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పిస్తున్న ఏఐఎస్ఏ నేతలు

రాయచోటి అర్బన్ : నీట్ పరీక్ష ఫలితాల్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఏ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం పలువురు నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు ఎస్.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ పర్యాయం ఎన్నడూ లేని విధంగా 67 మంది విద్యార్థులు 720 మార్కులు సాధించి టాప్ లిస్టులో నిలవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. పరీక్షల్లో అక్రమాల కారణంగా కష్టపడి చదువుకున్న విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం దారుణమని, దర్యాప్తు జరిపించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఏ రాయచోటి నేతలు సన్నీ, కుమార్, వెంకటరమణ, అరవింద్, రాజకుమార్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



డాక్టర్ మాబును పరామర్శిస్తున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : మండలంలోని ముసల్‌రెడ్డి పల్లె మాజీ సర్పంచ్ డాక్టర్ మాబును పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ మాజీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి బుధవారం పరామర్శించారు. ఈనెల 4న కౌంటింగ్ ఫలితాలతో ఆవేదన చెందిన ఆయన మూడు రోజులు ఆహారం సరిగా తీసుకోలేదు. 7వ తేదీన ఆయనకు గుండెపోటు రావడంతో కడపలో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా స్టంట్ వేయించారు. బుధవారం ఇంటికి వచ్చిన ఆయనను నాగార్జునరెడ్డి పరామర్శించారు. నాగార్జునరెడ్డి మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రిగా రెండోసారి అధికారంలో ఉంటారని విశ్వసించిన మాబు 4న ఎన్నికల ఫలితాలతో మనస్తాపానికి గురయ్యారన్నారు. మాబు, ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పామన్నారు. ఆయన వెంట దమ్మన్నపల్లె మాజీ సర్పంచ్ ఓబయ్య(జేకే), కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## అప్పల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య

- నేను చనిపోతున్నానంటూ సూసైడ్ నోట్
- నా కుటుంబానికి న్యాయం చేయండని వేడుకోలు



ఉరి వేసుకున్న రమేష్ బాబు

కురబలకోట : కొన్న ఇంటి స్థలం వివాదాస్పదం కావడం..మరో వైపు అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెందిన చేనేత కార్మికుడు ఉరి వేసుకుని బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర సంఘటన మండలంలోని అంగళ్లు మల్లయ్యకొండపై చోటుచేసుకుంది. ముదివేడు ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి కథనం మేరకు..మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె ప్రాంతం మారుతీనగర్‌కు చెందిన రామిశెట్టి రమేష్‌బాబు (48) చేనేత కార్మికుడిగా ఉంటున్నారు. ఇతడు రెండేళ్ల క్రితం వెంకటేష్, శివారెడ్డి, చంద్ర వద్ద కాట్లాటపల్లె రోడ్డు మార్గంలో ఒకటిన్నర కుంట ఇంటి స్థలం కొన్నాడు. ఇందుకు ముందుగా అడ్వాన్సు చెల్లించాడు. అయితే నీరుగట్టువారిపల్లెకు చెందిన పి.చంద్రశేఖర్, రత్నాలు ఈ స్థలం విషయమై అడ్డుతగిలారు. దీంతో ఈ భూమి కాస్త వివాదాస్పదంగా మారింది. భూమి విషయంలో మోసపోవడం .. చేసిన అప్పులు వేధించడంతో ఆర్థికంగా చితికిపోయి మానసికంగా కుంగిపోయాడు. బుధవారం ఉదయం స్కూటర్‌పై ఇంటి నుంచి బయలుదేరి అంగళ్లు మల్లయ్యకొండ చేరుకున్నాడు. మార్గమధ్యంలో గుట్టలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను ఇంటికి రాక పోవడం, ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని రావడంతో అనుమానంతో కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. వారు లోకేషన్ గుర్తించి అంగళ్లు మల్లయ్యకొండకు రాగా అక్కడ రోడ్డు పక్కన ఇతని స్కూటర్ కన్పించింది. పరిసరాల్లో వెతగ్గా చెట్టుకు ఉరివేసుకుని కన్పించాడు. సంఘటన స్థలంలో వెంట తెచ్చుకున్న చేతి బ్యాగుపై పోలీసులకు విన్నపం అంటూ ఇంటి స్థలం విషయం, అప్పులుండడంతో కుంగిపోయి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ రాసి ఉంది. పోలీసులు తన కుటుంబానికి న్యాయం చేయాలని అందులో వేడుకున్నాడు. పోలీసులు సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకని మృత దేహాన్ని మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా ఆధ్యాత్మిక క్షేత్రంగా పేరొందిన అంగళ్లు మల్లయ్యకొండపై ఆత్మహత్య జరగడం ఆ కొండ చరిత్రలో ఇదే ప్రప్రథమమని గ్రామస్థులు చెబుతున్నారు.

## విద్యార్థి విజయ రహస్యం పుస్తకావిష్కరణ



విద్యార్థి విజయ రహస్యం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సినియర్ సివిల్ జడ్జి బాబా ప్రకృద్దీన్ తదితరులు

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థుల భవిషత్తుకు బంగారు బాటలు పరిచేలా మంచి పుస్తకాలు రచించడం అభినందనీయమని డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్ పేర్కొన్నారు. కడప జిల్లా కోర్టు ఆవరణలోని డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయంలో మాజీ జిల్లా సమగ్రశిక్ష జిల్లా అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి రచించిన ‘విద్యార్థి విజయ రహస్యం’ పుస్తకాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి బాబా ఫకృద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సంస్కారం, జ్ఞానం, లోకజ్ఞానం, ఆధ్యాత్మిక భక్తి భావాలు పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచే దిశగా స్ఫూర్తిదాయక కథలను జతచేసి రచించడం ఆకట్టుకుందన్నారు. అనంతరం అంబవరం ప్రభాకర్‌రెడ్డిని జడ్జి అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి డిప్యూటీ డీఈఓ నాగమునిరెడ్డి, బాల ఎల్లారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

## వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్రగాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో మంగళవారం రాత్రి ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లె మండలం బొమ్మనచెరువు పంచాయతీ కోటగుండ్లపల్లెకు చెందిన రెడ్డెప్ప కుమారుడు రాజశేఖర్(25) వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. మార్గమధ్యంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. అదే విధంగా పట్టణంలోని ఎస్టేట్‌కు చెందిన వై.నరసింహులు(56) ద్విచక్ర వాహనంలో వస్తూ నిమ్మనపల్లె నాలుగురోడ్ల సర్కిల్ వద్ద వాహనం అదుపు తప్పి బారికేడ్లను ఢీకొన్నారు. దీంతో గాయాలయ్యాయి. అలాగే వలసపల్లె పంచాయతీ కొటాలపల్లెకు చెందిన శాంతమ్మ(52) సొంత పనులపై మదనపల్లెకు వచ్చి తిరిగి ఇంటికి వెళుతూ, నవోదయ పాఠశాల వద్ద ఆటో దిగి రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. జిల్లా ఆస్పత్రిలో చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. ఆయా ఘటనలపై సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.